నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
శనివారం | అక్టోబర్ 21, 2023 | www.navatelangana.com

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

బ్యాంకర్లు తమ లాగిన్‌లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో ఏర్పాటు చేసిన కామారెడ్డి నియోజకవర్గ స్థాయి రెండో త్రైమాసిక బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్రాప లోన్ వీవర్స్‌కు సంబంధించి వచ్చిన సమస్యలు పరిష్కరించాలన్నారు. . పంట రుణాలు, బంగారంపై రుణాలు, తీసుకొని క్లోజ్ అయిన ఖాతాలు, నూతన ఖాతాలు, ఆధార్ అనుసంధానం, వంటి అంశాలపై దృష్టి పెట్టి తమ లాగిన్‌లో వచ్చిన గ్రీవెన్స్‌పై తమ స్థాయిలో వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. సమావేశంలో లీడ్ టీబ్యాంక్ అధికారి భార్గవ్, జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి అదనపు డిఆర్ డిఓ మురళి కృష్ణ, నాబార్డు డిపిఎం ప్రవీణ్ కుమార్, రవి కుమార్, వివిధ బ్యాంకుల బ్రాంచ్ మేనేజర్లు పాల్గొన్నారు.

నాటు బెల్లం, పట్టిక పట్టివేత



నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని అన్నారం గ్రామంలో నాటు బెల్లం, పట్టిక విక్రయిస్తున్నారని నమ్మదగిన సమాచారం మేరకు శుక్రవారం కిరాణా షాపులపై దాడి చేసి నాటుబెల్లం, పటిక స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ విక్రం తెలిపారు. గ్రామానికి చెందిన కేంగర్ల శ్రీధర్ కిరణం షాపులో 72 కిలోల బెల్లం, 12 కిలోల పట్టిక, రవాణాకు ఉపయోగించిన ప్యాసింజర్ ఆటో, ఇల్లందుల గంగాధర్ ఇంట్లో 180 కిలోల బెల్లం, 10 కిలోల పట్టికను స్వాధీనం చేసుకున్నారు. వారి నుంచి వివరాలు ఆరా తీయగా జిల్లా కేంద్రంలోని ధర్మశాస్త్ర ట్రేడర్స్‌లో సోదాలు నిర్వహించగా 4248 కిలోల బెల్లం 80 కిలోల పట్టికను సీఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పట్టుకున్నట్లు ఎస్సై విక్రం తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



హాజరైన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు..

ఉల్లం‘ఘనుల’పై నిఘా

- లోటుపాట్లు లేకుండా పోలింగ్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి
- కలెక్టర్ జితేశ్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

తహసీల్దార్లు, ఎంపిడిఓలు క్షేత్రస్థాయిలో అన్ని పోలింగ్ కేంద్రాలను రూట్ వారీగా పరిశీలించి పోలింగ్‌కు అనువైన గదిని ఎంపిక చేసి సిద్ధం చేసేలా చూడాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. ప్రధానంగా పోలింగ్ కేంద్రాలు గ్రౌడ్ ఫ్లోర్ లోనే ఉండేలా చూడాలని, ఫర్నీచర్, విద్యుత్తూ, మంచినీరు, టాయిలెట్స్ ర్యాంప్ సౌకర్యాలతో పాటు వీల్ చైర్ అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. సువిధ యాప్ ద్వారా ఆన్ లైన్ లో వచ్చే దరఖాస్తులకు 24 గంటలలో అనుమతులివ్వాలని, అట్టి సమాచారాన్ని వ్యయ పరిశీలకుల కమిటీ, కంట్రోల్ రూమ్‌కు తెలపాలన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం వీడియో కవరేజి చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియామావళి ఉల్లంఘన ఘటనలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, ఎవరిని ఉపేక్షించరాదని కేసులు నమోదు చేయాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి అదనపు కలెక్టర్ మను చౌదరితో కలిసి రిటర్నింగ్ అధికారులు, డిఎస్పీలు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఎంపిఓలు, నోడల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు అవగాహనకు సంబందించిన 4 రకాల గోడపత్రికలు పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటుకు సిద్ధం చేసుకోవాలన్నారు. ఫారం 7, 8 లను రోజు వారి మానిటరింగ్ చేస్తూ పరిష్కరించాలని, నవంబర్ 10 వరకు ఓటరుగా నమోదయిన వారి అనుబంధ జాబితా సిద్ధం చేసుకోవాలన్నారు. పూర్తిగా మంచానికే పరిమితమై లేవలేని ముసలివారు, దివ్యాంగులకు ప్రభుత్వం ఫారం-12 డి ద్వారా ఇంటి నుండే ఓటు వేసే అవకాశం కల్పించిందని అన్నారు. డిస్ట్రిబ్యూషన్, రిసిప్షన్ కేంద్రాలలో ఈ.వి.ఏం. లను తరలించుటకు లేబర్‌ను సమకూర్చుకోవాలన్నారు. పోలింగ్ అనంతరం ఈ.వి.ఏం. లు నేరుగా రిసిప్షన్ కేంద్రాలకు చేరుకో వాలని సూచించారు. డబ్బు, మద్యం రవాణా, వివిధ రకాల తాయిలాల రవాణాపై గట్టి నిఘా ఉంచాలని, 10 లక్షల కన్నా ఎక్కువ డబ్బు స్వాధీనం చేసుకుంటే వెంటనే ఆదాయపన్ను టీమ్ కు తెలపాలన్నారు. ఎన్నికల ఘట్టంలో పోలింగ్ రోజు చాలా ముఖ్యమైనదని, ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులది కీలకపాత్ర అని అన్నారు. పోలింగ్ సందర్భంగా చేయవలసిన అన్ని అంశాలపై ఎన్నికల సంఘం రూపొందించిన హ్యాండ్ బుక్ ను ప్రతి ప్రిసైడింగ్ అధికారి, సహాయ ప్రిసైడింగ్ అధికారులు తూ.చ తప్పకుండా చదవడమే కాకుండా, అందులోని అన్ని నియమాలను పాటించాలని కలెక్టర్ సూచించారు. ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘం జారీ చేస్తున్న నూతన నిబంధనలు, రూల్స్ ప్రకారం ఎన్నికలను నిర్వహించాలని, ఎన్నికల పట్ల ఎట్టి పరిస్థితులలో నిర్లక్ష్యంగా ఉండవద్దని ఆయన కోరారు. పోలింగ్ సందర్భంగా చేయాల్సిన విధులు,చేయకూడని వాటిపై ప్రతి ఒక్కరికి పూర్తి అవగాహన ఉండాలన్నారు. ఎన్నికల విధులకు నియమించబడిన ఉద్యోగులు ఎలాంటి పార్టీలకు అభ్యర్థులకు అనుబంధంగా ఉండకూడదని, ఎన్నికల ప్రవర్తన నియమావళి కఠినంగా అమలు చేస్తున్నందున పూర్తి జాగ్రత్తగా విధులు నిర్వహించాలని చెప్పారు. పోలింగ్ రోజు, పోలింగ్ ముందు రోజు చేయాల్సిన పనులను చెక్ లిస్ట్ తయారు చేసుకుని దాని ప్రకారం విధులు నిర్వహించాలన్నారు. ముఖ్యంగా పోలింగ్ సందర్భంగా ప్రతి పి ఓ తీసుకోవాల్సిన మెటీరియల్, ఈవీఎంల నిర్వహణ, ఓటరు జాబితా మార్క్‌డ్ కాపీ, పిఓ, ఏపిఓ డైరీ, వారి విధులు, పోలింగ్ కేంద్రం బయట ప్రదర్శించినాల్సిన సామాగ్రి, పోలింగ్ కేంద్రంలోకి అనుమతించే వారు, మాక్ పోల్, ఈవీఎం, వివి ఫ్యాట్ లను ఎలా అనుసంధానం చేయాలి వంటి అన్ని విషయాలు అవగాహన ఉండాలన్నారు. ఈ సమావేశంలో కామారెడ్డి డిఎస్పీ ప్రకాష్, ఆర్.డి.ఓ. శ్రీనివాస్‌రెడ్డి, డిఎస్పీలు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఎంపిఓలు, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

దొరల ప్రభుత్వాన్ని తరిమికొట్టాలి

- పసుపునకు మద్దతు ధర కల్పిస్తాం
- బీఆర్ఎస్ అవినీతిపై సీబీఐ, ఈడీ దాడులు ఎందుకు లేవు..?
- కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ

నవతెలంగాణ-మోర్తాడ్/ఆర్మూర్



రాష్ట్రంలో దొరల ప్రభుత్వం కొనసాగుతుందని ఆ ప్రభుత్వాన్ని తరిమికొట్టాల్సిన సమయం ఆసన్నమైందని కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ అన్నారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌లో శుక్రవారం కార్నర్ మీటింగ్ నిర్వహించారు. అనంతరం పెర్కిట్ నుంచి ఆర్మూర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసంగించారు. రాష్ట్రంలో ప్రజల ప్రభుత్వం రావాలని దొరల సర్కారులను తరిమికొట్టాలని సూచించారు. తన ఎంపీ స్థానాన్ని రద్దు చేసినా, ఇల్లు ఖాళీ చేయించినా తాను మాత్రం దేశ ప్రజల గుండెల్లోనే ఉంటానని అన్నారు. ప్రస్తుతం బిజెపి ప్రభుత్వం తనపై 24 కేసులు నమోదు చేసిందని తాను మాత్రం ఇబ్బందులకు గురికాకుండా ప్రజా సంక్షేమం కోసమే పాటు పడతామని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న ప్రతిపక్షాలపై బీజేపీ.. సీబీఐ, ఈడితో ఎంక్వయిరీ చేపిస్తున్నా బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఎందుకు ఎంక్వయిరీ చేపించడం లేదని ప్రశ్నించారు.

వివరాలు మెయిన్‌లో..

భద్రంగా భద్రపరచాలి

నవతెలంగాణ-కామారెడ్డి

ఎన్నికలకు సంబంధించిన కంట్రోల్ యూనిట్లు, బ్యాలట్ యూనిట్లు, వి వి ప్యాట్లు మొదటి ర్యాండమైజేషన్ పూర్తి అయిన వెంటనే స్ట్రాంగ్ రూమ్ లలో బద్రపరచాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ చంద్ర మోహన్‌తో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులు, తహసీల్దార్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో 6,61,163 మంది ఓటర్లున్నారని, 791 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి కంట్రోల్ యూనిట్లు, బ్యాలట్ యూనిట్లు 25 శాతం, వివి ఫ్యాట్‌లు 40 శాతం అదనంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. మొదటి ర్యాండమైజేషన్‌లో ప్రత్యేక సాఫ్ట్వేర్ ద్వారా ఆటోమాటిక్‌గ నియోజకవర్గం, పోలింగ్ బూత్ వారీగా ఏఏ యంత్రాలు కేటాయించాలో జనరేట్ చేసిన జాబితాను అందజేస్తూ శనివారం ఉదయం 8 గంటల వరకెల్లా ఏ.వి.ఏం. గోదాములకు రావాలని కోరారు. అక్కడ నియోజక వర్గం వారీగా జనరేట్ చేసిన జాబితా ప్రకారం కంట్రోల్ యూనిట్లు, బ్యాలట్ యూనిట్లు, వి.వి.ఫ్యాట్ లను ఆయా నియాజక వర్గాలకు గట్టి భద్రత మధ్య తరలించి అక్కడ ప్రజాప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరుస్తామని అన్నారు. రెండవ దఫాలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ జరుగుతుందని, నవంబర్ 28న మూడవ ర్యాండమైజేషన్‌లో కంట్రోల్ యూనిట్లు, బ్యాలట్ యూనిట్లు, వి వి ప్యాట్లు ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించుటకు సిద్ధం చేస్తామని అన్నారు. పోలింగ్ ఏజెంట్లను త్వరగా నియమించుకో వాలని పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఏజెంట్లు ఎన్నికల ప్రక్రియ లో, పోలింగ్ సమయంలో ఏమో చేయాలో, తగు శిక్షణ ఇవ్వాలని తహసీల్దార్లకు సూచించారు. ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలు, వాహనాలు, సభలు, సమావేశాలు ఏర్పాటు, , డబ్బు పంపిణీ, తాయిలాలు ఇవ్వడం వంటివి దృష్టికి వస్తే వెంటనే తెలపాలని, లేకుంటే అభ్యర్థి ఖర్చు కిందకు వెళుతుందని తెలిపారు. సామాజిక మాడిమలలో వచ్చిన అసత్య వార్తల పట్ల అప్రమత్తం ఉండాలని, అభ్యంతరకర పోస్టులు ఉండరాదని హితవు చెప్పారు. ఈ సమాసీవేశంలో ఆర్డీఓ శ్రీనివాస్ రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ.. సజావుగా చేపట్టాలి

- కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం సేకరణ ప్రక్రియను ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా సజావుగా నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. ఇందల్వాయి మండల కేంద్రంతో పాటు డిచ్పల్లి మండలం బర్ధీపూర్ లో ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ శుక్రవారం అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డితో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తరలించిన ధాన్యాన్ని పరిశీలించి, మాయిశ్చర్ మీటర్ ద్వారా స్వయంగా తేమ శాతాన్ని కొలిచారు. రైతుల సౌకర్యార్థం కేంద్రాల్లో అందుబాటులో ఉంచిన సదుపాయాలను పరిశీలించారు. ధాన్యం తరలించిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దని హితవు పలికారు. 'ఏ" గ్రేడ్ ధాన్యం క్వింటాల్ కు 2203 రూపాయలు, ముతక రకానికి 2183 చొప్పున మద్దతు ధర చెల్లించడం జరుగుతుందన్నారు. అయితే రైతులు నాణ్యతా ప్రమాణాలకు లోబడి, బాగా ఆరబెట్టిన ధాన్యాన్ని తేవాలని, ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకు రావచ్చని సూచించారు. వ్యవసాయ విస్తీర్ణాధికారిచే ధ్రువీకరణ పత్రం, ఆధార్, బ్యాంకు పాస్ బుక్కు, పట్టా పాసు పుస్తకం జిరాక్స్ ప్రతులను వెంట తేవాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కొనుగోలు కేంద్రాలను సమర్ధవంతంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణ ప్రక్రియ వేగవంతంగా, పూర్తిస్థాయిలో నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా జరిగేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. రైతుల నుండి సేకరించిన ధాన్యాన్ని వెంటది వెంట లారీలలో లోడ్ చేయించి నిర్దేశిత రైస్ మిల్లులకు తరలించాలని, సరిపడా వాహనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో క్షేత్రస్థాయి సిబ్బంది మొదలుకుని అధికారుల వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, రైతుల ప్రయోజనాలతో ముడిపడిన అంశం అయినందున ఎంతమాత్రం అలసత్వానికి తావివ్వ కూడదని హితవు పలికారు. రైతులు ధాన్యం తీసుకువచ్చిన వెంటనే తూకం జరిపించాలని, నాణ్యతా ప్రమాణాలకు లోబడి ధాన్యం తీసుకు వచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో సేకరించిన ధాన్యం అకాల వర్షాలకు తడిసిపోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, టార్పాలిన్ లను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ధాన్యం విక్రయించిన రైతులకు వెంటదివెంట బిల్లుల చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, షామియానాలు అందుబాటు లో ఉంచాలన్నారు. కలెక్టర్ వెంట డీ ఎస్ ఓ చంద్రప్రకాశ్, సివిల్ సప్లైస్ డీ ఎమ్ జగదీష్, డీసీఓ సింహాచలం, జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, సొసైటీల సీఈఓ లు, స్థానిక అధికారులు, రైతులు తదితరులు ఉన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి తూకం పరిశీలిస్తున్న కలెక్టర్

యువజనులు కాంగ్రెస్ పార్టీ గెలుపునకు ముఖ్య పాత్ర పోషించాలి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

యువజనులు కాంగ్రెస్ పార్టీ గెలుపునకు ముఖ్యపాత్ర పోషించాలని తెలంగాణ యువజన విభాగం అధ్యక్షులు శివసేన రెడ్డి అన్నారు. ఆర్మూర్‌లో రాహుల్ గాంధీ విజయభేరి యాత్రలో భాగంగా శుక్రవారం తెలంగాణ యువజన విభాగం అధ్యక్షులు శివసేన రెడ్డిని రామ్మూర్తి గోపిని జక్రాన్ పల్లి యువజన విభాగం నాయకులు, మండల యువజన విభాగం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శివసేనారెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎలక్షన్లలో యువకులు కష్టపడి కాంగ్రెస్ పార్టీ గెలుపునకు ముఖ్య పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల యువజన విభాగం అధ్యక్షుడు సొప్పరి వినోద్, ఉపాధ్యక్షులు ప్రణయ్, సుప్పరి చింటు, సుధీర్, తదితరులున్నారు.

మెదక్ అధ్యక్ష మండలాన్ని మూడు భాగాలుగా చీల్చొద్దు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మెదక్ అధ్యక్ష మండలాన్ని మూడు భాగాలుగా చీల్చవద్దని జక్రాన్‌పల్లి ఫాస్ట్ రేట్ కమిటీ సభ్యులు అన్నారు. శుక్రవారం ఫాస్ట్ రేట్ కమిటీ సభ్యులు సంఘ సభ్యులు సమావేశం ఏర్పాటు చేసుకొని చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియాలోని మెదక్ అధ్యక్ష మండలాన్ని మూడు అధ్యక్ష మండలాలుగా చీల్చుతున్నారన్న సమాచారంతో ఉమ్మడి మెదక్ అధ్యక్ష మండలంగా ఉండాలని చర్చ సౌత్ ఇండియాకు ఫాస్ట్ రేట్ తీర్మానం కాపీని పంపిస్తామని పేర్కొన్నారు. మెదక్ అధ్యక్ష మండలంలో ని గోదావరి డిసిసి, మెదక్ డిసిసి, హైదరాబాద్ టౌన్ డిసిసిగా కొనసాగుతున్న డిసిసిలను మూడు అధ్యక్ష మండలాలుగా మారుస్తారన్న సమాచారం తెలుసుకొని, మెదక్ అధ్యక్ష మండలాన్ని ఎప్పటి లాగానే ఉంచాలని తీర్మానం కాపీని పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఫాస్ట్రేట్ కమిటీ సభ్యులు కమిటీ, మాజీ ఫాస్ట్ రేట్ సభ్యులు, సంఘ సభ్యులు తదితరులు ఉన్నారు.

పట్టాలు.. రైతు నేస్తాలు



- ధాన్యం ఆరబోతకు రక్షణ కవచాలు

నవతెలంగాణ-బోధన్

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట నేలపాలు కాకుండా గింజ గింజను కాపాడుకుంటారు. గతంలో యంత్రాలు లేని సమయంలో కూలీలతో వరి కోతల కోసి పొలంలోనే వరి మోపులు కట్టి కుప్పగా వేసేవారు. అనంతరం వారం 10 రోజుల తర్వాత కూలీలతో కుప్పలను నూర్పిడి చేసేవారు. గడ్డిలో మిగిలిన ధాన్యం పూర్తిగా రాలడానికి ఎడ్లతో, ట్రాక్టర్లతో బంతి కొట్టేవారు. తదనంతరం గడ్డిని తొలగించి ధాన్యాన్ని వేరు చేసేవారు. ఇలా ఈ ప్రక్రియతో కొంతవరకు ధాన్యం నేలపాలయ్యేది. దాంతో రైతులు 20, 30 కిలోల వరకు ఏదో రకంగా నష్టపోతుండేవారు. కానీ మారిన కాలానికి అనుగుణంగా వరి కోత యంత్రాలు రావడంతో రైతులకు ఇబ్బందులు తప్పాయి.

ప్రస్తుత కాలంలో వరి పంట కోతకు వచ్చిన దశలో వరి కోత యంత్రాలతో పంట కోసి నేరుగా ట్రాక్టర్లలో నింపి దానిని ఖాళీ స్థలాలలో ఈ పట్టాలు వేసి దానిపై ఆరబోస్తున్నారు. దాంతో రైతు పంట పొలంలో ధాన్యం కింద పడకుండా పండిన ప్రతి గింజ రైతు చెంతకు చేరుతుంది. నేడు ఏ గ్రామంలో చూసిన మందు సంచులతో తయారుచేసిన పట్టాల విక్రయాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం సోయా, వరి పంటలు కోతలు కొనసాగుతూ ఉండడంతో రైతులు ఈ పట్టాలను ఆశ్రయిస్తున్నారు. రైతులు తమ పంటలను విక్రయించేంత వరకు పట్టాలను వారి పంటలకు రక్షణంగా ఉపయోగించుకుంటున్నారు.



పట్టా కిరాయిలతో నామ మాత్ర ఉపాధి

రైతులు తమ పంటలకు రక్షణ కోసం పట్టాలను రోజువారి అద్దెపై తీసుకెళ్తున్నారు. ఈ పట్టాలను కొందరు స్థానికంగా తయారుచేస్తే, మరికొందరు ఆంధ్ర రాష్ట్రం నుంచి లారీలలో దిగుమతి చేసుకుంటున్నారు. ఒక లోడు లారీకి మూడు నుంచి నాలుగు లక్షలు చెల్లించి వ్యాపారులు తెప్పిస్తున్నారు. 20/14 సైజు గల పట్టాలు రోజు రూ.15/-ల చొప్పున కిరాయికి ఇస్తున్నారు. ఒక పట్టాను అమ్మితే 350 నుంచి 400 లోపు వస్తుందని వ్యాపారులు తెలిపారు. అయినా పెట్టుబడికి తగిన ఉపాధి రావడం లేదని వ్యాపారులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వరి ,సోయా పంటల కోతల సమయం కావడంతో కొంతవరకు ఉపాధి పొందవచ్చని ఈ పట్టాలు వ్యాపారం చేస్తున్నట్లు సాలుర మండల కేంద్రానికి చెందిన వ్యాపారి షేక్ జాఫర్ తెలిపారు. ఆంధ్ర రాష్ట్రం నుంచి పట్టాలు తీసుకువచ్చి వ్యాపారం చేస్తే కనీసం వడ్డీ డబ్బులు రావడం లేదని తన ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు పడితే ఈ పట్టాలను ఎవరు తీసుకెళ్లరని, ఇలా ఎండ ఉన్న రోజుల్లోనే దీనికి గిరాకీ ఉంటుందని ఆయన తెలిపారు. మరికొన్ని గ్రామాలలో ఆంధ్ర ప్రాంతం నుంచి వలస వచ్చిన కుటుంబాలు పట్టల వ్యాపారంతో కుటుంబాలను పోషించుకుంటున్నారు. ప్రభుత్వం వీధి వ్యాపారులకు చేయూతను అందించిన విధంగా పట్టా వ్యాపారులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

ఉపాధి పొందేందుకు..

షేక్ జాఫర్, సాలూర



ప్రస్తుతం వరి, సోయా పంటల కోతలు రావడంతో పట్టాలకు గిరాకీ ఉంటుందని ఆంధ్ర నుంచి లక్షల రూపాయలు వెచ్చించి పట్టలు తెప్పించాను. ఇక్కడ ఒక పట్టాకు 15 రూపాయల కిరాయి మాత్రమే ఇస్తారు. ఒక్కోపట్టా 350/-ల నుంచి 400/-ల వరకు అమ్ముతాము. ఈ సంవత్సరం 1600 పట్టాలు ఆంధ్ర నుంచి తెప్పించా. టిఫిన్ సెంటర్ ఉండడంతో దానికి తోడు పట్టాల వ్యాపారం చేస్తే ఉపాధి వస్తుందని భావించి ఈ వ్యాపారం చేస్తున్నా. కానీ ఆశించినంత లాభం మాత్రం రావడం లేదు.

కస్టమ్ మిల్లింగ్ రైస్‌కోసం

గోదాముల్లో అవసరమైన స్థలం ఇవ్వాలి

అదనపు కలెక్టర్ చంద్రమోహన్

నవతెలంగాణ-కామారెడ్డి

రైస్ మిల్లర్లు భారత ఆహార సంస్థకు అందించవలసిన కస్టమ్ మిల్లింగ్ రైస్ ను వేగవంతంగా అందజేయుటకు గాను గోదాములలో అవసరమైన స్థలం, హమాలీలలను ఇవ్వాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ పౌర సరఫరాల సంస్థ మేనేజర్ ప్రకాష్ వర్మ ను కోరారు. ఎఫ్‌సిఐ మేనేజర్‌గా కొత్తగా వచ్చిన ప్రకాష్ వర్మ శుక్రవారం అదనపు కలెక్టర్‌ను ఛాంబర్ లో కలవగా కామారెడ్డి జిల్లా నుండి భారత ఆహార సంస్థకు సిఎంఆర్ రైస్‌ను శరవేగంతో అందించుటకు గాను గోదాముల్లో అవసరమైన స్థలం కేటాయిం చడంతో పాటు అవసరమైన హమాలీలలను సమకూర్చాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ అభిషేక్ సింగ్ తదితరువులు పాల్గొన్నారు.

బిజెపికి రాజీనామా చేసిన డాక్టర్ గోపాలం విద్యాసాగర్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలం లోని ధర్మారం బి గ్రామానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ గోపాలం విద్యాసాగర్ శుక్రవారం భారతీయ జనతా పార్టీ (బిజెపి) కి శుక్రవారం పార్టీకి, సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. రెండున్నరేళ్లుగా బిజెపి లోనే ఉంటూ నేడు బిజెపి లో జరుగుతున్న పరిణామాలు, ఇతరత్రా అంశాలతో పార్టీలో ఉండలేక ఇమడ లేక పోవడం వలన పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని వివరించారు. ఇప్పటి వరకు సహకరించి, కలసి పని చేసిన నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. త్వరలో ఏ పార్టీలో చేరేది ప్రకటిస్తానని వివరించారు.

ఈవీఎం గోడౌన్‌ను సందర్శించిన కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ


ఈవీఎం గోడౌన్ సందర్శించిన కలెక్టర్

జిల్లా కేంద్రంలోని వినాయకనగర్‌లో గల ఈవీఎం గోడౌన్ ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శుక్రవారం సందర్శించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ తెరిపించి, బ్యాలెట్ యూనిట్లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను పరిశీలించారు. ప్రస్తుత సాధారణ ఎన్నికలలో వినియోగించాల్సి ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వివరాల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

కృష్ణ హెూటల్‌ని ప్రారంభించిన ఎమ్మెల్సీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యేలు గణేష్ బిగాల, బాజిరెడ్డి గోవర్ధన్ బృందవన్ గార్డెన్స్‌లో కృష్ణ హెూటల్ ని శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్, గాదెకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనా ప్రజల హక్కులను కాపాడాలి


సమావేశంలో మాట్లాడుతున్న మాధవరావు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

గాజాపై ఇజ్రాయిల్ దురాక్రమణ దాడిని విరమించుకోవాలని మానవ హక్కుల వేదిక మాజీ రాష్ట్ర అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది గొర్రెపాటి మాధవరావు అన్నారు. పాలస్తీనా ప్రజల హక్కులను కాపాడాలని, గజాపై ఇజ్రాయిల్ దురాక్రమణ దాడులను వెంటనే విరమించుకోవాలని, ఐక్యరాజ్యసమితి జోక్యం కల్పించుకోవాలని డిమాండ్ చేశారు. గాజాపై ఇజ్రాయిల్ దాడిని నిరసిస్తూ నిజామాబాద్ నగరంలోని నీలం రామచంద్రయ్య భవన్ సీపీఐ(యం-యల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో సదస్సును శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలస్తీనాలోని గాజా ప్రాంతంపై కొన్ని రోజులుగా ఇజ్రాయిల్ దాడులు చేస్తుందని ఆ దాడిలో ఇప్పటివరకు అనేక వేల మంది ప్రజలు మరణించారని, యుద్ధం వల్ల అమాయక ప్రజలు కరెంట్ లేక తిండిలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఐక్యరాజ్య సమితి తీర్మానాలను ఉల్లంఘించి పాలస్తీనా గాజా ప్రాంతాలను ఇజ్రాయిల్ ఆక్రమించుకుంటుందని, దాని వల్ల రెండు దేశాల మధ్య యుద్ధాలు జరుగుతున్నాయని, ఐక్యరాజ్య సమితి జోక్యం చేసుకుని యుద్ధాన్ని నివారించాలని, ప్రజల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(యం-యల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, డివిజన్ కార్యదర్శి వేల్పూర్ భూమయ్య, న్యూ డెమోక్రసీ నాయకులు భూమన్న, శివ కుమార్, మురళి, సత్యం, సాయిరెడ్డి, జన్నారపు రాజేశ్వర్, సాయినాథ్, గంగాధర్, భారతి తదితరులు పాల్గొన్నారు.

పూర్తయిన మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సాధారణ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా శుక్రవారం మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు నేతృత్వంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఎన్ఐసి హాల్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ పూర్తి పారదర్శకంగా ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. నిజామాబాద్ జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోగల పోలింగ్ కేంద్రాలకు కేటాయించాల్సి ఉన్న కంట్రోల్ యూనిట్లు, బ్యాలట్ యూనిట్లు, వివి ప్యాట్ల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ గురించి కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరిస్తూ, ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా ఈ ప్రక్రియ మొత్తాన్ని స్క్రీన్ ద్వారా చూపించారు. ర్యాండమైజేషన్ ద్వారా ఖరారైన జాబితాను ప్రతినిధులకు, ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. ర్యాండమైజేషన్ జాబితా ఆధారంగానే జిల్లాలోని ఆర్మూర్, బోధన్, బాల్కొండ, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బాన్సువాడ శాసనసభ నియోజకవర్గాలకు కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వివి ప్యాట్లు కేటాయించడం జరుగుతుందని, ఆయా సెగ్మెంట్లలో స్ట్రాంగ్ రూమ్ లలో కట్టుదిట్టమైన భద్రత నడుమ వాటిని భద్రపరుస్తామని కలెక్టర్ తెలిపారు. ఆరు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో మొత్తం 1549 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఎన్నికల సంఘం ఆదేశాల అనుసారం 25 శాతం అదనంగా బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లను రిజర్వ్‌లో ఉంచడం జరుగుతుందని, 40 శాతం వి.వి.ప్యాట్లను రిజర్వ్‌లో ఉంచేలా అదనంగా కేటాయిస్తున్నామని అన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలను తుచ తప్పకుండ పాటిస్తూ, పూర్తి పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ ప్రక్రియను చేపడుతున్నామని, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, పి.యాదిరెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో ప్రతి కార్యకర్తకు గుర్తింపు


భోగ రాముకు గులాబీ కండువావేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-నందిపేట్

బీఆర్ఎస్ పార్టీ ప్రతి కార్యకర్తకు గుర్తింపునిస్తుందని ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన పర్యటించారు. మండల కేంద్రంలో డెంటల్ ఆసుపత్రిని ప్రారంభించారు. వెల్మల్ గ్రామానికి చెందిన భోగ రాము ఏడో వార్డు సభ్యుడు బిజెపి పార్టీ పద్మశాలి సంఘం సెక్రెటరీ బిజెపి పార్టీకి రాజీనామా చేసి, తమ పూర్తి మద్దతు ముఖ్యమంత్రి కేసీఆర్‌కి ఉంటుందని ఆయన తెలిపారు. బోగ రాముతో పాటు ఆయన అనుచరులకు ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం బోగ రామును నందిపేట్ మండల బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీగా నియమించినట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జీవన్ రెడ్డి తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షకులు

నవతెలంగాణ-ఆర్మూర్

• నేడు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం



ఎన్ని కష్టాలు ఉన్న దిగమింగుకొని ప్రజల రక్షణకు నిరంతరం పాటుపడేది పోలీసులు. వృత్తి నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనం. శాంతి భద్రతల పరిరక్షణకు కదం తొక్కే కార్యదక్షులు. ప్రజలను నిత్యం కంటికి రెప్పలా కాపాడుకుంటూ సమాజ అభివృద్ధికి పాటుపడే సేవకులు. ఈ పోరాటంలో సంఘ విద్రోహ శక్తుల దాడులకు కొంతమంది ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ....

14 గంటల పోరాటం..

1959 అక్టోబర్ 21.. భారతదేశ సరిహద్దుల్లో చైనా దురాక్రమణలను తిప్పికొట్టేందుకు సిఆర్పీఎఫ్ జవాన్లు 14 గంటలపాటు వీరోచితంగా పోరాడారు. ఈ పోరులో 12 మంది భారత జవాన్లు వీర మరణం పొందారు. ఈ ఘటన అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది అయితే నాటి నుంచి దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన అమరవీరుల స్మారకార్థం ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ సందర్భంగా నవ తెలంగాణ కథనం...

ఉమ్మడి జిల్లాలో 39 మంది పోలీసుల ప్రాణత్యాగం...

నక్సలైట్ల ఉద్యమం మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాల్లో పోలీసులు, సిఆర్‌పిఎఫ్, బిఎస్ఎఫ్ జవాన్లు మొత్తం 39 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇందులో కొందరు నక్సలైట్ల తూటాలకు బలి కాగా, మరికొందరు బాంబు పేలుళ్లకు ప్రాణాలు విడిచారు. కాగా నక్సలైట్ల ఘాతుకాలకు బలైపోయిన వారిలో జిల్లాకు చెందిన పోలీస్ అధికారులు సిబ్బంది 24 మంది ఉండగా వివిధ పోలీసులు 15 మంది జవాన్లు జిల్లాకు బందోబస్తు కోసం వచ్చి దాడుల వల్ల ప్రాణాలు కోల్పోయారు.

1986 జనవరి రెండవ తేదీన కామారెడ్డి జిల్లాలోని సదాశివ నగర్ మండలం పోసానిపేట పరిధిలోని గోకుల తండా అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీసులపై నక్సలైట్లు ఆకస్మికంగా కాల్పులు జరిపారు ..ఈ ఘటనలో ఏడవ బెటాలియన్‌కు చెందిన బిస్మేశ్వరరావు ప్రాణాలు కోల్పోయారు. 1991 సంవత్సరం నందిపేట మండలం యానం శివారులో నక్సలైట్లు మందు పాతరతో పోలీస్ జీబును పేల్చేశారు. దీంతో ఎస్సై సత్తయ్య మృతి చెందారు. 1992 ఫిబ్రవరి 7వ తేదీన రంగారెడ్డి వద్ద మరో ఘటన జరిగింది. అడవిలో కూంబింగ్ కోసం పోలీసులు వ్యాన్లో వెళ్తుండగా మందు పాతర పెట్టి వ్యానునే పేల్చేశారు. ఇందులో ఏడవ బెటాలియన్‌కు చెందిన సుంకన్న, బాబర్‌తో పాటు డ్రైవరు మరో ఇద్దరు పోలీసులు అక్కడికక్కడే మృతి చెందారు. 1996 మార్చిలో పదవ తరగతి పరీక్షల బందోబస్తుకు వెళ్లిన ఏఎస్ఐ రామచంద్రారావును నక్సలైట్లు కాల్చి చంపారు. ఇదే సంవత్సరం ఎన్నికల బందోబస్తులో ఉన్న ఎస్సై విక్టర్ బాంబు దాడిలో ప్రాణాలు కోల్పోయారు.. ఈ ఘటన సిరికొండ మండలంలోని రావుట్ల న్యావనంది గ్రామాల మధ్య చోటుచేసుకుంది. కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన గంగాధర్ ఎమ్మెల్సీగా పనిచేసిన వి. గంగాధర్ గౌడ్ గన్‌మెగా పనిచేసినారు.. 1996 జూన్ 6న జిల్లా సహకార బ్యాంకు వద్దకు కొందరు నక్సలైట్లు వచ్చి తుపాకీ ఇవ్వాలని గంగాధర్‌ను డిమాండ్ చేయగా అయన నిరాకరించారు.. దీంతో నక్సలైట్లు ఆయనను కాల్చి చంపారు. జిల్లా కేంద్రంలో పట్టపగలే ఈ ఘటన జరగడం అప్పట్లో తీవ్ర సంచలనం రేకెత్తించింది.

1996 ఆగస్టు 15న ఆయుధాల కోసం ఆదిలాబాద్ జిల్లా సిర్పూర్ పోలీస్ స్టేషన్‌పై నక్సలైట్లు మెరుపు దాడి చేయగా ఈ ఘటనలో బెటాలియన్ కు చెందిన గులాం రసూల్, సుభాష్ చంద్రబోస్, జబ్బర్లాల్, వేణు, మారుతీ రావు, వాసు ఐజయ్య ప్రాణాలు కోల్పోయారు. 1998 ఫిబ్రవరిలో ఎన్నికల విధులు ముగించుకొని సీఆర్పిఎఫ్ జవాన్లు బస్సులో హైదరాబాద్ క వెళ్తున్నారు.. ఈ క్రమంలో జాతీయ రహదారి చంద్రాయన్ పల్లి వద్ద నక్సలైట్లు మందు పాతర పెట్టి బస్సును పేల్చేశారు . ఈ ఘటనలో ఇద్దరు జవాన్లు మరణించారు. గాంధారికి చెందిన కానిస్టేబుల్ కుతుబుద్దీన్ పల్లికొండ లోని బంధువుల ఇంటికి వెళుతుండగా నక్సలైట్ల తూటాలకు బలయ్యారు.

ఆర్మూర్ కు చెందిన తండ్రి కొడుకులు....

ఆర్మూర్‌కు చెందిన సోమరాజు, వెంకటేశ్వరరావు తండ్రి కొడుకులు. వీరిద్దరూ విధి నిర్వహణలోనే ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఒకరు నక్సలైట్ల చేతిలో ప్రాణాలు కోల్పోగా మరొకరు అగ్ని ప్రమాద బాధితులను కాపాడే ప్రయత్నంలో చనిపోయారు. 1988 ఫిబ్రవరిలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో కానిస్టేబుల్ సోమరాజుపై నక్సలైట్లు ఆకస్మితంగా కాల్పులు జరపడంతో అక్కడికక్కడే మృతి చెందారు. 2008 ఏప్రిల్ నెలలో డిచ్‌పల్లి శివారులోని జాతీయ రహదారిపై ఆగి ఉన్న బిస్కెట్ కంటైనర లో మంటలు చెలరేగాయి. ఈ సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు అక్కడికి చేరుకొని మంటల్లో చిక్కుకున్న కంటైనర్ సిబ్బందిని కాపాడేందుకు ప్రయత్నించారు.. కాగా బాధితులను రక్షించే క్రమంలో వెంకటేశ్వరరావు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ప్రమాదంలో హెూంగార్డు గూగుల్ రవీందర్, ఏఆర్ కానిస్టేబుల్ ఆయూబుఖాన్ కూడా మరణించారు.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నుండి..

శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తుంది. పోలీస్ స్టేషన్లో ఓపెన్ హౌస్, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, రక్తదాన శిబిరాలు ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న ఈసారి ఎన్నికల విధులలో సైతం నిర్విరామ సేవలు చేస్తున్నారు. నూతన సాలూర మండలంలోని కుమ్మన్‌పల్లి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ గంగా ప్రసాద్ ఇటీవల సిక్కిం వరదల్లో అకాల మరణం పొందడంతో రాష్ట్ర స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులను ఆదుకునేందుకు కలెక్టర్ తో మాట్లాడి భరోసా కల్పించారు. బాన్సువాడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ వారు సైతం 25 వేల ఆర్థిక సహాయం అందజేశారు. మెండోరా మండలంలోని చాకిరియాల గ్రామానికి చెందిన కానిస్టేబుల్ నర్సయ్య నక్సలైట్ల తూటాలకు బలి కాగా పోలీస్ శాఖ తరపున సహాయ సహకారాలు అందిస్తామని ఏసిపి జగదీశ్ చందర్, రూరల్ సిఐ గోవర్ధన్ రెడ్డి ఎస్సైలు వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

వారి త్యాగాలు మాకు ఆదర్శం..



సమాజంలో శాంతిభద్రతలు కాపాడే క్రమంలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరులే మాకు ఆదర్శం. వారిని స్ఫూర్తిగా తీసుకొని పని చేస్తాం. ప్రాణాలు పణంగా పెట్టి కుటుంబాలకు దూరమైన పోలీసులు ఎప్పుడు చిరస్మరణీయులే. శాంతి భద్రతలను కాపాడేందుకు నిర్విరామంగా పని చేస్తాం.

జగదీష్ చందర్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, ఆర్మూర్.

ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా..



ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్నాం .ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం ద్వారా ప్రజల సమస్యలు తీరుస్తున్నాం..

సురేష్ బాబు, స్టేషన్ హౌస్ ఆఫీసర్,, ఆర్మూర్.

ప్రజల ఆశీర్వాదంతో మరోసారి గెలుస్తా

• ఎలక్షన్ శంఖారావం పూరించిన బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-మోపాల్


ప్రచారం ప్రారంభానికి ముందు ఆలయంలో ప్రత్యే పూజలు చేసి వస్తున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి

ప్రజల ఆశీర్వాదంతో కచ్చితంగా గెలుస్తానని నిజామాబాద్ రూరల్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. శుక్రవారం మండలంలోని బోర్గాం(పి) గ్రామంలోని సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో బాజిరెడ్డి గోవర్ధన్ కుటుంబ సమేతంగా నుడా చైర్మన్ ఈగ సంజీవరెడ్డి దంపతులు కలిసి పూజలు నిర్వహించారు. బొర్గం సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితుల మధ్య వారిని సన్మానించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ కచ్చితంగా ప్రజల ఆశీర్వాదంతో గెలిచి తీరుతానని, తనకు ఈ రూరల్ ప్రజల ఆశీర్వాదం ఉందని, తనను మూడోసారి కూడా శాసనసభకు పంపుతారని ఆయన తెలిపారు అలాగే కాంగ్రెస్, బిజెపిల గురించి ఆయన మాట్లాడుతూ వారు ఇక్కడ చేసేదేమీ లేదని వారి రిమోట్ కంట్రోల్ మొత్తం ఢిల్లీలో ఉంటుందని అన్నారు. రాహుల్ గాంధీ వచ్చినా కూడా ఇక్కడ నాయకులు ఆశించిన స్క్రిప్ట్ చదవడం తప్ప ఆయనకు ఈ జిల్లా పైన కానీ జిల్లాలో ఉన్న సమస్యలపైన కానీ అవగాహన లేదని అన్నారు. దాదాపు 60 సంవత్సరాలు పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వారు చేసింది కూడా శూన్యమని, అలాగే నాతో పోటీ చేసిన నాయకులు కనీసం ప్రతిపక్ష పాత్ర కూడా పోషించలేనంత దౌర్భాగ్య స్థితిలో ఉన్నారని అన్నారు. కేవలం ఎలక్షన్ సమయంలోనే వారు ఇక్కడ ఉంటారని ప్రజల బాగోగులు తెలుసుకునే సమయం కూడా వారికి ఉండదని, అటువంటి వారిని రూరల్ ప్రజలు నమ్మరని తెలిపారు. రూరల్ ప్రజలందరినీ కుటుంబ సభ్యులుగా భావిస్తానని, దాదాపుగా రోజుకి 14 గంటల సమయం ప్రజలతో గడుపుతానని, కేసీఆర్ కిట్టు కానీ రైతుబంధు, పింఛన్లు పోయినసారి ఎలక్షన్‌లో కూడా చెప్పని పథకాలను కూడా ప్రజల కోసం అమలుచేస్తామని అన్నారు. తమది ప్రజల ప్రభుత్వమని మల్లొకసారి కచ్చితంగా కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని, మళ్లీ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మారుస్తారని తెలిపారు. నుడా చైర్మన్ ఈగ సంజీవరెడ్డి మాట్లాడుతూ ప్రజలు మేలు చేసిన వారిని మర్చిపోరని, ముచ్చటగా మూడోసారి కూడా రూరల్ నియోజకవర్గం లో బాజిరెడ్డి గోవర్ధన్‌ను బ్రహ్మాండమైన మెజార్టీతో గెలిపిస్తారని తెలిపారు. గోవర్ధన్ మచ్చలేని నాయకుడని, ప్రతిక్షణం ప్రజల గురించి ఆలోచించే మనిషి అని, ఇంతకుముందు వచ్చిన మెజార్టీ కంటి రెట్టింపు మెజార్టీతో గెలుస్తారని, ప్రతిపక్ష నాయకులను ప్రజలు నమ్మరని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కొర్వ దేవేందర్, నుడా డైరెక్టర్ అభిలాష్ రెడ్డి, ఈగ శ్రీనివాస్ రెడ్డి, రఘు, సతీష్ రెడ్డి, మొచ్చ శ్రీనివాస్, మోహన్ నాయక్, మీసాల మధుకర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేనిదే డీజేలు పెట్టకూడదు

• పట్టణ సీఐ నరహరి
• డీజే యజమానులకు కౌన్సిలింగ్


డీజే యజమానులతో మాట్లాడుతున్న సీఐ నరహరి

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున పట్టణంలో పోలీసుల అనుమతి లేకుండా ర్యాలీలు, ఇతర కార్యక్రమాల్లో డీజేలు పెట్టకూడదని పోలీసులు తెలిపారు. అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జయరాం, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణ సీఐ నరహరి, రెండవ పట్టణ ఎస్ఐ అశోక్ , మూడవ పట్టణ ఎస్సై ప్రవీణ్ కుమార్, నాలుగో పట్టణ ఎస్సై సంజీవ్ శుక్రవారం డీజే యజమానులను కౌన్సెలింగ్ నిర్వహించారు.

ఎవరైనా ఆదేశాలను ఉల్లంఘించిన వారి మీద చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని అన్నారు. డీజే యజమానులను తహసీల్దార్ల ఎదుట హాజరు పరిచి బైండోవర్ చేసినట్టు పట్టణ సీఐ నరహరి తెలిపారు. ఎవరైనా డీజేలు పెట్టినట్టయితే వారి మీద చట్టరిత్యా చర్యలు తీసుకోవడమే కాకుండా చట్ట ప్రకారం సీజ్ చేసి కోర్టు యందు ఉంచడం జరుగుతుంది. కార్యక్రమంలో రెండవ, మూడవ, నాల్గవ పట్టణ ఎస్ఐలు అశోక్, ప్రవీణ్, సంజీవ్, డీజే యజమానులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయెల్ నరమేధాన్ని నిరసించండి

• ఇజ్రాయిల్ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడిని ఖండిస్తూ నిజామాబాద్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సామ్రాజ్యవాద ఇజ్రాయిల్ దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ మాట్లాడుతూ... అమెరికా వెన్నుదన్నుగా ఉండటం చూసుకొని ఇజ్రాయెల్ కండకావరంతో పాలస్తీనా మీద దుర్మార్గ దాడులు చేస్తూ నరమేధం సృష్టిస్తుందన్నారు. హాస్పిటల్లు, స్కూల్స్ మీద కూడా బాంబులు వేసి వందలాది మందిని పొట్టన పెట్టుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. గాజాలోని 20 లక్షల ప్రజలని ఉత్తర భాగం నుంచి 24 గంటల్లో ఖాళీ చేయాలని అల్టిమేటం ఇచ్చి, వారికి నీళ్ళు, విద్యుత్ బంద్ చేసిందన్నారు. గాజాలోని పాలస్తీనా ప్రజలను ఖాళీ చేసి ఆ ప్రాంతాలను ఆక్రమించ చూస్తుందన్నారు. తల దాచుకోవడానికి పాపమని చోటిస్తే ఇజ్రాయెల్ యూదు దురహంకారం పాలస్తీనీయులను తమ మాతృభూమి నుంచే వెళ్లగొట్టారనీ ఆరోపించారు. పశ్చిమాసియాలో ఆధిపత్య దురాక్రమణదారుగా నేడు ఇజ్రాయెల్ మారిందన్నారు. 75 ఏండ్లుగా అలీన విధానం అనుసరిస్తున్న ఇండియా పాలస్తీనీయుల పక్షం వహించిందన్నారు. నేడు మోడీ బీజేపీ నేతలు అమెరికా తోడు నీడలో సంచరిస్తూ ఇజ్రాయెల్ బలపరచడం అన్యాయమన్నారు. అలానే గోడి మీడియా పాలస్తీనా పోరాట వాదులను టెర్రరిస్టుగా చిత్రించడం అన్యాయమన్నారు. ఇజ్రాయెల్ దాడులు ఆపాలని, ఐక్యరాజ్య సమితి తీర్మానాలను అమలు చేయాలని పాలస్తీనాను స్వతంత్ర రాజ్యాన్ని గుర్తించాలని డిమాండ్ చేశారు. వారికి ప్రపంచ దేశాలు తిండి, మందులు అందించాలన్నారు. జియోనిస్ట్ ఇజ్రాయెలుకు మనదేశం మద్దతు ఇవ్వవద్దన్నారు. ఇజ్రాయెల్ దాడులను ఖండించాలన్నారు. కార్యక్రమంలో ప్రజాపంథా డివిజన్ సహాయ కార్యదర్శి సాయగౌడ్, డిచ్ పల్లి మండల కార్యదర్శి మురళి, మోపాల్ మండల కార్యదర్శి గంగమల్లు, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి సంధ్యారాణి, పీడీఎస్‌యూ జిల్లా ప్రధానకార్యదర్శి కర్క గణేష్, నగర అధ్యక్షులు అషుర్, డివిజన్ నాయకులు కిషన్, గంగారాం, మోహన్, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు సాయిబాబా, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అలుకట శ్రీనివాస్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఓబిసి జిల్లా ప్రధాన కార్యదర్శిగా అలుకట శ్రీనివాస్ గౌడ్ ను నియమించారు. ఈమేరకు నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఓబిసి రాష్ట్ర అధ్యక్షులు శ్రీకాంత్ ఆదేశాల మేరకు జిల్లా ఓబీసీ అధ్యక్షులు డి. రాజా నరేందర్ గౌడ్ చేతుల మీదుగా శుక్రవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఓబిసి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియామకానికి సహకరించిన మాజీ ఎమ్మెల్సీ నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ ఇంచార్జి డాక్టర్ భూపతి రెడ్డికి, రాష్ట్ర టిపిసిసి ప్రధాన కార్యదర్శి కాట్ పల్లీ నాగేష్ రెడ్డి కి, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, టిపిసిసి డెలిగేట్ శేఖర్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొలసాని శ్రీనివాస్, డిచ్‌పల్లి అధ్యక్షులు అమృతపుర్ గంగాధర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ పెద్దోల శ్రీనివాస్, మండల్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ ఇబ్రహీం, మండల వైస్ ప్రెసిడెంట్ కర్షిప్ సుదర్శన్, మండల ఓ బి సి అధ్యక్షులు రాజన్న, నడిపల్లి కాంగ్రెస్ అధ్యకులు దూసుగం వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.


నియమక పత్రాన్ని అందుకుంటున్న శ్రీనివాస్ గౌడ్

రామారెడ్డి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ సింధు శర్మ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్లోని రికార్డులను, క్రైమ్ వివరాలను ఆరా తీశారు. పాత నేరస్తులను బైండోవర్ చేయాలని, ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేయాలని, ఎన్నికల దృష్ట్యా శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ సుధాకర్, పోలీస్‌స్టేషన్ సిబ్బంది తదితరులున్నారు.

ఎమ్మెల్యే హన్మంత్ షిండేకే మద్దతు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్


మద్దతు తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న రైస్‌మిల్లర్స్

జుక్కల్ శాసనసభ్యులు హన్మంత్ షిండే ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎన్నికల బరిలో ఉండటంతో బాన్సువాడ డివిజన్ రైస్ మిల్లర్ అసోసియేషన్ సభ్యులు తమ మద్దతు ఎమ్మెల్యే హన్మంత్ షిండేకే తెలుపుతున్నట్లు ఏకగ్రీవంగా తీర్మానం చేసి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. షిండేకు తమ మద్దతు ఉంటుందని ఆయన స్వగృహం బిచ్కుందలో తీర్మాన కాపీని అందజేసినట్లు తెలిపారు. భారీ మెజారిటీతో హన్మంత్‌షిండేను గెలిపించుకుంటామని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అడుగుల లక్ష్మణ్, అసోసియేషన్ ప్రతినిధులు ఎలెవల కృష్ణరెడ్డి, ప్రతాపరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా తనిఖీలు

- అంబులెన్స్ తనిఖీలో 5 లక్షల నగదు పట్టివేత

నవతెలంగాణ-బోధన్/బోధన్

సాలూర మండలం అంతరాష్ట్ర చెక్‌పోస్టు వద్ద శుక్రవారం బోధన్ రూరల్ పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీలో మహారాష్ట్ర దెగ్లూర్ నుంచి బోధన్ వైపు వెళ్తున్న అంబులెన్స్‌ను బోధన్ రూరల్ ఎస్ఐ నాగనాథ్ తనిఖీ చేయగా అందులో 5.11 లక్షల రూపాయల నగదు లభించిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పట్టుకున్న నగదు వివరాలను సీఐ శ్రీనివాసరాజ్ వెల్లడిస్తూ మాటాడారు. చెక్ పోస్టు వద్ద పట్టుకున్న నగదుకు పంచనామా నిర్వహించి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించినట్లు సీఐ శ్రీనివాసరాజ్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా నిరంతరం చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలు చేపడుతున్నామని వివరించారు. వాహనాలలో రూ.50,000లకు మించి నగదు తరలించవద్దని, లేని ఎడల ఎన్నికల నిబంధనల ప్రకారం నగదును సీజ్ చేస్తామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆర్ఓ పర్వన్న ఉన్నారు.



బోధన్ : ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు


భిక్కనూర్: వాహన తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

భిక్కనూర్ : మండలంలో 44వ జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహనాలను తనిఖీలు చేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డిప్యూటీ కమిషనర్ దశరథ్ ఆధ్వర్యంలో ఎన్నికల సందర్భంగా ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తరలించకుండా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, అక్రమ మద్యం రవాణా చేస్తే వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేయనున్నట్టు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దోమకొండ సీఐ మధుసూదన్‌రావు, ఎస్సై శ్రావణ్, హెడ్‌కానిస్టేబుల్ మొయినొద్దీన్, కానిస్టేబుల్ వహీద్, జాకబ్, స్వాతి, బాలరాజు తదితరులున్నారు.

జీపీ కార్యదర్శికి మెమో జారీ

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని కొడిచర్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి తమ విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదని మండల అభివృద్ధి అధికారి రవీశ్వర్‌గౌడ్ జీపీ కార్యదర్శికి మెమో జారీ చేశారు. పంచాయతీ విధుల్లో పై అధికారుల ఆదేశాలు బేఖాతర్ చేయడమే కాకుండా విధుల్లో నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని ఎంపీడీవో ఆ గ్రామానికి పరిశీలించారు. కార్యదర్శి హాజరుకాకపోవడంతో ఎంపీడీవోకు విధుల్లో సరైన సమాధానం ఇవ్వకపోవడం కార్యదర్శికి మెమో జారీ చేసినట్టు ఎంపీడీవో తెలిపారు.

స్పీకర్ కే మా మద్దతు


ఏకగ్రీవ తీర్మానాన్ని అందజేస్తున్న సంఘం నాయకులు

నవతెలంగాణ-కోటగిరి

ఉమ్మడి మండలంలోని గౌడ సంఘం సభ్యులు శుక్రవారం బాన్సువాడలోని పోచారం శ్రీనివాస్‌రెడ్డి గృహంలో రాబోయే ఎన్నికలలో పోచారం శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా ఏకగ్రీవ తీర్మానాన్ని అందజేశారు. సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన నాయకులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అని గౌడ సంఘం నాయకులు గంగాధర్‌గౌడ్ పేర్కొన్నారు. గౌడ సంఘం నాయకులు కాశాగౌడ్, సురేష్‌గౌడ్, అరుణ్ కుమార్‌గౌడ్, గంగాప్రసాద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో దుర్గామాత చండీయాగం


చండీయాగంలో పాల్గొన్న సర్పంచ్, తదితరులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని తాడ్‌బిలోలి రామాలయంలో దుర్గామాత విగ్రహాన్ని ఏర్పాటు చేయగా శుక్రవారం చండీయాగాన్ని నిర్వహించారు. అంతకుముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెల్మల సునీత నరసయ్య, జగన్మోహన్‌రెడ్డి, ఎ.శ్రీనివాస్, ప్రసాద్, సునీల్‌యాదవ్ తదితరులున్నారు.

యువజన కాంగ్రెస్ కమిటీ ఎన్నిక


సమావేశమైన నాయకులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ గ్రామంలో కాంగ్రెస్ యువజన గ్రామ కమిటీ మండల అధ్యక్షులు కార్తిక యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. గ్రామ కమిటీ అధ్యక్షులుగా దండు అనిల్, ఉపాధ్యక్షులుగా గుర్రాల మారుతి, గుర్రాల గంగాధర్, భరత్‌గౌడ్, అఖిల్, ప్రధాన కార్యదర్శిగా మల్లెల మధు, కార్యదర్శులుగా ప్రసాద్ కంఠం, నీలం రాజు, ముఖిత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ యువజన గౌరవాధ్యక్షులు శంషుద్దీన్, ప్రధాన కార్యదర్శి గైని కిరణ్, ఉపాధ్యక్షులు అలీముద్దీన్, 20మంది కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఇవి భవిష్యత్ ఎన్నికలు

- ఎమ్మెల్యే జాజాల సురేందర్

నవతెలంగాణ-సదాశివనగర్

ఇవి మాములు ఎన్నికలు కాదని, భవిష్యత్ ఎన్నికలని ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని మర్కల్ స్టేజీ వద్ద అశోక్‌గార్డెన్‌లో సదాశివనగర్-రామారెడ్డి బి.ఆర్.ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ మాట్లాడుతూ.. కేసీఆర్‌ను మూడవసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. '40 రోజులు మా కోసం పనిచేయండి. 5 సంవత్సరాలు మీ కోసం పని చేస్తానని అన్నారు. కాంగ్రెస్ ఉన్న రాష్ట్రంలో ఇయ్యని ఫించన్లు తెలంగాణ రాష్ట్రంలో ఇస్తున్నామని చెప్పారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఈ సారి ఎన్నికల్లో ఎమ్మెల్యే సురేందర్‌ను 70వేల ఓట్ల మెజారిటీతో గెలిపిస్తామన్నారు. కార్యకర్తలు అన్నదమ్ములుగా కలిసిఉండి గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో సదాశివనగర్ బి.ఆర్.ఎస్ మండలాధ్యక్షుడు బాలిపెల్లి మహేందర్‌రెడ్డి, జడ్పీటీసీ కమిలి నర్సింలు, రామారెడ్డి ఎం.పి.పి దశరథ్‌రెడ్డి. జిల్లా కో ఆప్షన్ మెంబర్ మొహీనోద్దీన్ మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్గం సాయిరెడ్డి, సర్పంచ్‌లు బద్దం శ్రీనివాస్‌రెడ్డి, అనిల్, భాస్కర్‌రెడ్డి, నర్సయ్య, నాయకులు గాదారి అశోక్‌రెడ్డి, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్

ఘనంగా బతుకమ్మ సంబురాలు

నవతెలంగాణ-దోమకొండ/గాంధారి

మండల కేంద్రంలోని ఆయా వీధులలో బతుకమ్మ పండగ వేడుకలు నిర్వ హించారు. మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ ఆటలు ఆడారు. అనంతరం స్థానిక చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

గాంధారి : మండల కేంద్రంలో అట్ల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించా రు. ఈ సందర్భంగా యువతులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ ఆడారు.



దోమకొండలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, గాంధారిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, చిన్నారులు

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

నవతెలంగాణ-మాచారెడ్డి

మండలంలోని వెనుకతాండ గ్రామస్తులు మాచారెడ్డి ఎంపీపీ డాక్టరేట్ లోయపల్లి నర్సింగరావు ఆధ్వర్యంలో మూకుమ్మడిగా కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి శుక్రవారం బీఆర్ఎస్ పార్టీలోకి చేరారు. గ్రామస్తులందరూ పార్టీలో చేరాక వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ కామారెడ్డి నియోజకవర్గం నుంచి పోటీ చేయడం చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు. కేసీఆర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకొని తమ గిరిజన తండాలు, మారుమూల గ్రామాలు అతి తొందరగా అభివృద్ధి చేసుకుంటామని తెలిపారు. అనంతరం లోయపల్లి నరసింహారావు మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో కామారెడ్డి నియోజకవర్గంలో ఏ గ్రామంలో రాని మెజార్టీని 74 శాతం ఓట్లతో అత్యధిక మెజార్టీ బీఆర్ఎస్ పార్టీకి ఇచ్చి గెలిపించుకున్నామని గ్రామస్తులందరికీ గుర్తు చేశారు. అంతకుమించి మెజార్టీ 90 శాతం ఇవ్వాలని గ్రామస్తులను కోరారు. అలాగే కామారెడ్డి నుంచి కెసిఆర్ పోటీ చేస్తున్న నేపథ్యంలో 9 గ్రామాలు కేసీఆర్‌కు మద్దతుగా కామారెడ్డి నియోజకవర్గంలో మున్ముందుగా ఏకగ్రీవ తీర్మానాలు ఇచ్చిన ఘనత మన ఉమ్మడి ఎల్లంపేట గ్రామాలదేనని తెలియజేశారు. ఈ విషయాన్ని కేసీఆర్, కేటీఆర్ గుర్తించి ప్రత్యేక అభినందనలు తెలియజేశారని అన్నారు. మనందరం కారు గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీ ఇచ్చి మళ్లీ బీఆర్ఎస్ పార్టీని గెలిపించుకుందామని గ్రామస్తులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లావుడియా రేణు, చంద్రునాయక్, సర్పంచ్ దేవ్ సింగ్ నాయక్, గ్రామపెద్దలు మహిళలు, యువకులు, పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


బీఆర్ఎస్ పార్టీలో చేరిన గ్రామస్తులు

అక్రమ లేఅవుట్ దందా

- ఉన్నతాధికారుల చర్యలు శూన్యం


అక్రమ లేఅవుట్లు ఏర్పాటు చేసిన స్థలం

నవతెలంగాణ-మద్నూర్

మండల పరిధిలోని మద్నూర్, హండెకెలూర్ గ్రామ పంచాయతీల పరిధిలో అక్రమ లే అవుట్ దందాలు జోరుగా కొనసాగుతున్నాయి. అనుమతులు లేకుండా లేఅవుట్ల పట్ల జీపీ కార్యదర్శులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ చర్యలు శూన్యమయ్యాయి. గ్రామ పంచాయతీల అనుమతులు లేకుండా హద్దులు వేసి లక్షల రూపాయలకు ఒక ప్లాట్ చొప్పున అమ్మకాలు జరుగుతుంటే ఇలాంటి అక్రమ లేఔట్‌ల గురించి సంబంధిత శాఖల అధికారులు నిద్రావస్థలో పనిచేయడంపై ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పంచాయతీల పర్మిషన్లు లేకుండా అక్రమ లేఔట్లు వేస్తూ జోరుగా దందాలు కొనసాగిస్తుంటే పంచాయతీల అధికారుల నోటీసులు పనిచేయడం లేదు. అక్రమ లేఅవుట్లపై సంబంధిత శాఖల ఉన్నతాధికారుల దృష్టికి నివేదికలు వెళ్లినా మండల, డివిజన్, జిల్లా అధికారులు కన్నెత్తి చూడకపోవడం అక్రమ లేఅవుట్ల యజమాన్యాల ద్వారా సంబంధిత శాఖల అధికారులకు ముడుపులు అందుతున్నాయని ఆరోపణలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. పంచాయతీల పరిధిలో అక్రమ లేఔట్‌లపై మండల పంచాయతీ అధికారి వెంకట నరసయ్యకు ఫోన్ ద్వారా వివరణ కోరగా తమ దృష్టికి వచ్చిన మాట నిజమేనని అక్రమ లేఔట్‌లపై చర్యలు తీసుకుంటామని, అక్రమంగా పాతిన హద్దులు

పాల్ద మహాలక్ష్మి మాతకు బోనమెత్తిన ఎమ్మెల్యే

- పట్టు వస్త్రాలు సమర్పించిన బాజిరెడ్డి గోవర్ధన్


మహాలక్ష్మి ఆలయంలో పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

నిజామాబాద్ రూరల్ మండలంలోని పాల్ద గ్రామంలో మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి శుక్రవారం ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ బోనమెత్తారు. పట్టు వస్త్రాలు సమర్పించి, మహాలక్ష్మి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాల్దా గ్రామంలో పులాంగ్ వాగుపై వంతెన నిర్మాణం చెయ్యాలని, వందల ఎకరాలు వాగు బయట ఉన్నాయి, వ్యవసాయ క్షేత్రానికి వెళ్లడానికి సులువుగ మారుతుందని తెలిపారు. రైతులకు, గ్రామ ప్రజలు శాంతాపూర్, బొంకంపల్లి, ముల్లంగి గ్రామాలకు వెళ్లడానికి ప్రజలకు రవాణా సౌకర్యం ఎంతో మేలు జరుగుతుందని గతంలో ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. దీంతో వంతెన నిర్మాణం కోసం రూ. 20 గతంలో నిధులు మంజూరు చేశారు. ఈ విషయంపై ఎమ్మెల్యే దృష్టికి తీసు కెళ్లగా ఎలక్షన్ తర్వాత మరిన్ని నిధులు సమకూర్చి వంతెనను పూర్తిచేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి విజి గౌడ్, జిల్లా ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షులు, ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, నుడా చైర్మన్, ఒలింపిక్ అధ్యక్షులు ఈగ సంజీవ రెడ్డి, సొసైటీ ఛైర్మెన్ జితేందర్, మహాలక్ష్మి ఆలయ కమిటీ పెద్దోళ్ల లక్ష్మారెడ్డి, సుంకరి నరేష్, ఒడ్డేపల్లి మల్లయ్య, ఎంపీటీసీ ఆమని, నవీన్, నరేష్ గ్రామ అభివృద్ధి కమిటీ గోపాల్ రెడ్డి, రాజు, అబ్బన్న, ప్రతాప్ రెడ్డి, బీఆర్ఎస్ మండల నాయకులు మధుకర్ రావు,దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే షిండే పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని దేవీ సంతోషిమాత ఆలయంలో జుక్కల్ ఎమ్మెల్యే హనుమంతు షిండే సతీసమేతంగా దంపతులు శుక్రవారం ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులు అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో పాటు మద్నూర్, బిచ్కుంద, తదితర మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సలాబత్‌పూర్ ఆలయంలో..

త్వరలో జరగబోయే జుక్కల్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు కోసం జుక్కల్ ఎమ్మెల్యే హనుమంతుషిండే మూడు రాష్ట్రాల సరిహద్దులో గల మద్నూర్ మండలంలోని సలాబత్పూర్ ఆంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం పూజలు నిర్వహించారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-ఎడపల్లి


లింగయ్య మృతదేహం

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని మంగల్‌పాడ్ గ్రామంలో చోటుచేసుకుం ది. ఎస్సై విక్రం వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బెదిరి నడిపి లింగయ్య (55) వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. అయితే ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక తీవ్ర మనస్థాపానికి గురై శుక్రవారం తెల్లవారుజామున ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని చూసిన స్థానికులు గ్రామ ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వగా.. వారు అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో ఎస్సై భూపల్లి విక్రమ్ ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. అనంతరం శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

9 రూపాల్లో దుర్గాదేవి ప్రతిమల ఏర్పాటు


అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలో దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సార్వజనిక్ దేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి 9 రూపాల్లో ఉన్న విగ్రహాలను ప్రతిష్ఠించారు. స్థానిక గౌడ సంఘం నాయకులు స్వామిగౌడ్ గత 14 సంవత్సరాలుగా దేవి విగ్రహాలను దాతగా అందించి సహకరిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం దేవి మండపం వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో దాత స్వామిగౌడ్, ఇల్లెపు శంకర్, బుద్దె రాజేశ్వర్, సొసైటీ చైర్మెన్ జనార్దన్, వెంకట్‌పటేల్, శివకాంత్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.


మండపాల వద్ద కుంకుమార్చనలు


కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలోని గ్రామపంచాయతీ ఎదుట గల గ్రామ రైతు యువజన సంఘం ఆధ్వర్యంలో దేవీ నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా శుక్రవారం మహిళలు దుర్గామాత ఎదుట కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారి శ్రీనివాస్ శర్మ మాట్లాడుతూ.. నవరాత్రుల్లో భాగంగా నిత్యం ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేస్తున్నట్టు తెలిపారు.

పలు గ్రామాల్లో అన్నదానం


గ్రామాల్లో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని మద్దికుంట, ఈసన్నపల్లి, పోసానిపేటతో పాటు ఆయా గ్రామాల్లోని దుర్గామాత మండపాల వద్ద శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మండపాల నిర్వాహకులు, ఆయా గ్రామస్తులు పాల్గొన్నారు.

అమరవీరుల కుటుంబ సభ్యులకు ఆహ్వానం



నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ 7వ బెటాలియన్ డిచ్‌పల్లిలో శనివారం నిర్వహించే పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంనకు, బెటాలియన్ కమాండెంట్ బి. రాంప్రకాశ్ ఆదేశాల మేరకు, ఆర్ఐపి శ్యాంరావు, ఆర్‌యస్ఐ బి. చంద్రశేఖర్ పోలీస్ అమర వీరుల కుటుంబ సభ్యులకు శుక్రవారం ఆహ్వానం పలికారు. చిరంజీవమ్మ, శాంతాబాయి, పద్మ ఇతర కుటుంబ సభ్యుల ఇండ్లకు వెళ్ళి కలిసి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. బెటాలియన్‌లో నిర్వహించ బోయే పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంకు ప్రత్యేకంగా రావాలని ఆహ్వానించినట్లు తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతి



నవతెలంగాణ-ఎడపల్లి

ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని మంగళ్‌పాడ్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన తక్కెల సతీష్ (25) అనే యువకుడు గురువారం సుమారు రాత్రి 8 గంటలకు బతుకమ్మలను స్థానిక చెరువులో వదులుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి చెరువు నీటిలో మునిగిపోయారు. ఊపిరాడక మృతిచెందాడు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఆయనకు భార్య శ్యామల ఉన్నారు.

30న జుక్కల్‌కు సీఎం కేసీఆర్

- సభాస్థలి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



సభాస్థలి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-జుక్కల్

అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అక్టోబర్ 30వ తేదీన జుక్కల్ మండలానికి రానున్న నేపథ్యంలో శుక్రవారం జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండే జుక్కల్ చౌరస్తా వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. సభాస్థలిని, హెలిప్యాడ్ స్థలం, పార్కింగ్, ఏర్పాట్లను కౌలాస్ సర్పంచ్ గొల్ల హన్మండ్లు, కేమ్రాజ్‌కల్లాలీ మాజీ సర్పంచ్ సుంకరి వెంకటి, యువ నాయకుడు హరీష్‌షిండేతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ సూపర్‌వైజర్ బాలకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోఆప్షన్ నెంబర్ బులెట్ అక్బర్‌ఖాన్ పూజలు



పూజలు చేస్తున్న బుల్లెట్ అక్బర్‌ఖాన్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

కుల మతాలకు అతీతంగా కోఆప్షన్ నెంబర్ బుల్లెట్ అక్బర్‌ఖాన్ పూజలు చేస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన బుల్లెట్ అక్బర్ ఖాన్ పార్టీలకు అతీతంగా కులమతాలకు అధికంగా అందరితో కలుపుగోలుగా ఉండే వ్యక్తి. ఆయన వినాయక పూజల్లో పాల్గొన్నారు. ప్రస్తుతము దుర్గాదేవి మండపాల వద్ద కూడా ప్రజాప్రతినిధులతో పూజా కార్యక్రమాల్లో పాల్గొంటూ అన్నదాన కార్యక్రమంలో పాల్గొంటున్నారు. చర్చిలలో కూడా ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటూ అందరితో కలుపుగోలుగా ఉంటూ, తనకు తోచిన సహాయం అందజేస్తున్నారు. తన వద్దకు వచ్చిన వారికి పలు సూచనలు సలహాలు అందజేస్తూ లాభాపేక్ష లేకుండా మాట సహాయం అందజేస్తూ శభాష్ అనిపించుకుంటున్నాడు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు పాల్గొంటూ, దుర్గామాత మండపాల వద్ద, వినాయక మండపాల వద్ద పూజా కార్యక్రమంలో పాల్గొని కులమత బేధము లేదు అనే నినాదాన్ని ప్రజలకు సందేశాన్ని అందిస్తున్నారు.

ఆక్సిజన్ సిలిండర్ అందజేత

నవతెలంగాణ-రామారెడ్డి


అత్యవసర సమయంలో రోగికి నారెడ్డి స్వచ్ఛంద సంస్థ ద్వారా ఆక్సిజన్ సిలిండర్‌ను శుక్రవారం అందజేశారు. పాల్వంచ మండలంలోని సింగరాయపల్లి గ్రామానికి చెందిన లక్ష్మి ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతోంది. ఊపిరి పీల్చుకోవడం ఇబ్బందిగా ఉండడంతో స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు నారెడ్డి మోహన్‌రెడ్డిని సంప్రదించగా ఆక్సిజన్ సిలిండర్‌ను ఏర్పాటు చేశారని మోహన్‌రెడ్డికి బాధితులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు అందుబాటులో శనగ విత్తనాలు

నవతెలంగాణ-రామారెడ్డి

రైతులకు అందుబాటులో శనగ విత్తనాలు ఉన్నాయని, శనగ పంటను సాగుచేసే రైతులు భూమి పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో రామారెడ్డి మండల కేంద్రానికి రావాలని, 25 కేజీల ధాన్యం రూ.1875 ధర ఉందని మండల వ్యవసాయ అధికారి హరీష్ కుమార్ తెలిపారు.

కేసీఆర్‌కు కుల సంఘాల మద్దతు



బీఆర్ఎస్‌లో చేరుతున్న పలువురు

నవతెలంగాణ-రామారెడ్డి

కామారెడ్డి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పోటీ చేస్తున్నందున కుల సంఘాలు ఏకగ్రీవంగా మద్దతు తెలుపుతున్నాయి. కామారెడ్డిలో శుక్రవారం మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన మ్యాదరి, నాయిబ్రాహ్మణ సంఘం సభ్యులు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దశరథ్‌రెడ్డి, మాచారెడ్డి ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు, నాయకులు బుచ్చిరెడ్డి, రవీందర్‌రెడ్డి, స్వామిగౌడ్, బాలరాజ్, బట్టు సంతోష్, రాజయ్య తదితరులున్నారు.

రాహుల్ గాంధీ సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

రాహుల్ గాంధీ సభకు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్మూర్ బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చిన్నారెడ్డి మండల యువజన విభాగం అధ్యక్షులు సొప్పరి వినోద్ మండల ప్రధాన కార్యదర్శి వసంతరావు, శ్రీనివాస్ , సాయిల్ , సుధీర్ , ప్రేమ్ కుమార్ కాటిపల్లి అనిత్ , సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

దొరల తెలంగాణ కావాలా?
ప్రజల తెలంగాణ కావాలా?

- స్ట్రీట్ కార్నర్ సభలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ
- పెర్కిట్‌లో భారీ ర్యాలీ

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ ప్రజల కలలను కాలరాస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వం దోపిడీకి దిగబడుతుందని రాబోయే ఎన్నికల్లో దొరల తెలంగాణ కావాలో ప్రజల తెలంగాణ కావాలో తేల్చుకోవాలని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. పట్టణంలోని పెర్కిట్ బైపాస్ నుండి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల తెలంగాణ కోసం కాంగ్రెస్ ను గెలిపించాలని, దొరల తెలంగాణకు చమర గీతం పాడండి అని అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం స్ట్రీట్ కార్నర్ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి రాగానే ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి తలుపులు తెరిచి ఉంటాయన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలను కల్వకుంట ప్రగతి భవన్‌లో ఉంటున్నారన్నారు. సోనియా గాంధీ తెలంగాణ ప్రజల ఆకాంక్షను తెలుసుకొని తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందన్నారు. ఇందిరా గాంధీ హయాంలో పేదలకు వ్యవసాయ భూములు, ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చింద న్నారు. సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తే కెసిఆర్ కుటుంబ పాలన చేస్తు దోపిడి చేస్తున్నారని విమర్శించారు. కెసిఆర్ పాలనలో ధరలు పెరిగి ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్‌ను కాంగ్రెస్ పార్టీ ఓడిస్తుందన్నారు. అదేవిధంగా నాలుగు రాష్ట్రాల్లో జరిగే శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బిజెపిని ఓడించి అధికారంలోకి వస్తుంద న్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో భూములు, ఇసుక దందాతో పాటు అనేక అక్రమాలకు పాల్పడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల సంక్షేమాన్ని కోరుకుంటుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సోనియా గాంధీ ప్రకటించిన ఆరు పథకాలను కచ్చితంగా అమలు చేస్తామన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ పసుపు రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని విమర్శించారు. తాము అధికారంలోకి రాగానే పసుపును క్వింటాలుకు 12 నుంచి 15 వేల రూపాయలకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు.అర్హులైన పేదలకు ఇంటి నిర్మాణాలు, రూ 500కే గ్యాస్ సిలిండర్ ప్రతి మహిళకు రూ. 2500, ప్రతి నెల రూ. 4000 పింఛన్ ఇస్తామన్నారు.చేతి గుర్తుకు ఓటు వేసి ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి, బాల్కొండ లో సునీల్ రెడ్డి, బోధన్ లో సుదర్శన్ రెడ్డి లను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సభలో ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే రేఖా నాయక్ రాజీవ్ గాంధీ సమక్షంలో పార్టీలో చేరడంతో కండువా కప్పి ఆహ్వానించారు. సభకు విచ్చేసిన జనానికి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి, సుదర్శన్ రెడ్డిలను రాహుల్ గాంధీ చేతులెత్తి పరిచయం చేయించారు. ఈ సభలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్ చార్జి మాణిక్ ఠాకూర్, పార్లమెంట్ సభ్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి, మాజీ పార్లమెంట్ సభ్యుడు మధుయాష్కి గౌడ్, టీపీసీసీ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర కన్వీనర్ దేగాం ప్రమోద్, టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర సభ్యుడు కోల వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు సాయి బాబా గౌడ్, వివిధ జిల్లాల నాయకులు కార్యకర్తలు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



స్ట్రీట్ కార్నర్ సభకు తరలివచ్చిన ప్రజలు



మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ

బీఆర్ఎస్‌ది పేగుబంధం

- కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణతో కాంగ్రెస్‌కు ఎన్నికల బంధమేనని బీఆర్ఎస్‌ది పేగు బంధమని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. శుక్రవారం నగరంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. పేగుబంధాన్ని తెలంగాణ ప్రజలు కచ్చితంగా ఆదరిస్తారని అన్నారు. తెలంగాణకు చెందిన ఉమ్మడి రాష్ట్ర సీఎం అంజయ్యను హైదరాబాద్ విమానాశ్రయంలో రాజీవ్ గాంధీ అవమానించి ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారన్నారు. 2009లో సోనియా గాంధీ తెలంగాణ ఇస్తున్నామని ప్రకటించి వెనక్కి వెళ్లిన కారణంగా వందలాది మంది అమరులయ్యారన్నారు. అనంతరం ఎమ్మెల్యే గణేష్ బిగాల మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవిత సారథ్యంలోనే మనం ఎన్నికల శంఖం పూరిద్దామని, తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కేసిఆర్ రక్షణ కవచం లా ఉన్నారని, కేసిఆర్ పాలనలో అభివృద్ధి సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా మారిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం ఏ విధంగా ఉద్యమం చేశామో అదే తరహాలో అభివృద్ధిని సాధించామని తెలిపారు. నిజామాబాద్ అభివృద్ధిలో భాగంగా ప్రతి గల్లీ లో రోడ్లు డ్రైనేజి లు నిర్మించామని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తో అండర్ గ్రౌండ్ డ్రైనేజి నిర్మించామని తెలిపారు. నగరంలోని ప్రతి ఇంటికి అండర్ గ్రౌండ్ డ్రైనేజి కనెక్షన్ లు ఇవ్వడానికి ఎమ్మెల్సీ కవిత ముఖ్యమంత్రిని ఒప్పించి నిధులు మంజూరు చేశారన్నారు. కార్యక్రమం లో నగర మేయర్ దండు నీతూ కిరణ్, మాజీ మేయర్ ఆకుల సుజాత, రెడ్కో మాజీ చైర్మన్ అలీం, బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్ష-కార్యదర్శులు సిర్ప రాజు, ఎనుగందుల మురళి, సుజిత్ సింగ్ ఠాకూర్, సూదం రవి చందర్, సత్య ప్రకాష్, మజాజ్ అలీ తదితరులు పాల్గొన్నారు.



మాటాడుతున్న ఎమ్మెల్సీ కవిత

ఉద్యమంలో కష్టపడ్డ వారిని విస్మరించడం సరికాదు

- పది రోజులు చూసి తప్పుకోవడమే మంచిది
- ఉద్యమ నాయకులు ఏఎస్ పోశెట్టి

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఉద్యమంలో కష్టపడి పని చేసిన వారిని విస్మరించడం సరికాదని, పది రోజులు చూసి తప్పుకోవడమే మంచిదని ఏఎస్ పోశెట్టి అన్నారు. శుక్రవారం నగరంలోని ప్రెస్ క్లబ్‌లో మాజీ పోలిట్ బ్యూరో సభ్యులు, తెలంగాణ ఉద్యమ నాయకులు ఏఎస్ పోశెట్టి, తెలంగాణ ఉద్యమ నాయకులు అదే ప్రవీణ్ విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ పోశెట్టి మాట్లాడుతూ.. పార్టీకి పునాదులు వేసిన వారం మేమేనని, 13 ఏళ్ల టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా పని చేశానని, రాష్ట్ర స్టేట్ సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, పోలిట్ బ్యూరో మెంబర్‌గా పని చేసి పార్టీ బలోపేతం కోసం ఎంతో శ్రమించి కష్ట పడ్డ తమకు ఉద్యమ కారులకు కేసీఆర్ మొండి చేయి చూపించారని అన్నారు. రాష్ట్రం రాకముందు కేసీఆర్ పిలుపు మేరకు నిజామాబాద్ నుంచి ఎం.నారాయణ రెడ్డి, బాపు రెడ్డితో పాటు తాను కొండా లక్ష్మణ్ బాపూజీ ఇంట్లో కేసీఆర్ మొదటి సమావేశంలో పాల్గొన్నామన్నారు. అందులో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై ఎంచేద్దా మని చర్చలు జరుపగా మీటింగ్‌ల వల్ల లాభం లేదని, పార్టీ పెట్టాలని మొదట తానే చెప్పానని అన్నారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయం నీళ్లు, నిధులు నియామకాలపై పోరాటం చేయడం కోసం సపరేట్ తెలంగాణ వస్తేనే బాగు పడతామని వివరించానని తెలిపారు. 15 రోజుల తరువాత కేసీఆర్ మళ్ళీ ఫోన్ చేసి పిలిపించుకున్నారని ఆ తరువాత పార్టీ నిర్ణయం తీసుకున్నారని అన్నారు. వెంటనే నిజామాబాద్ జిల్లా అధ్యక్షులుగా తనను ప్రకటించారని, తన అధ్యక్షతన నిజామాబాద్‌లో 36 మంది జెడ్పీటీసీలకు టికెట్ ఇప్పించి 24 మంది గెలిపించు కున్నానని తెలిపారు. జిల్లా పరిషత్‌ను గెలిపించుకుని సంతోష్ రెడ్డిని జాయిన్ చేశానని అన్నారు. ఎలక్షన్‌లో తెలంగాణ ఉద్యమానికి తల్లి నిజామాబాద్ అన్నారు. అప్పట్లో 50 లక్షలు ఇస్తే మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్తామని పిలిచి చెప్పారని, ఉద్యమంలో సర్వం కోల్పోయిన తమకు పదవులు ఇవ్వకుండా అన్యాయం చేశారన్నారు. తెలంగాణ క్యాబినెట్‌లో తెలంగాణ వాదులు ఎవరైనా ఉన్నారా అని ప్రశ్నించారు. కొడుకు, బిడ్డ, అల్లుడుకు మాత్రమే న్యాయం జరిగిం దని ఎద్దేవా చేశారు. 9 నెలల కింద ఒక రిపోర్టర్‌ను పంపగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతామని చెప్పి ఇప్పటి వరకు పిలుపు రాలేదని వాపోయారు. కేసీఆర్ నిజామాబాద్ వేదిక మీద మంత్రి ప్రశాంత్ రెడ్డితో పోశెట్టిని తీసుకొని రమ్మని చెప్పాడని, ప్రశాంత్ రెడ్డికి ఫోన్ చేస్తే చాలా రోజుల వరకు రిప్లై ఇవ్వలేదని, ఒకసారి ఫోన్ లో అడిగితే ఇప్పటి వరకు ఇద్దరు ముగ్గురికి అలాగే సీఎం చెప్పా రని అలాంటిదేమీ లేదని దాటవేశారని చెప్పారు. కోట్లు తీసుకుంటేనే పదవులు ఇస్తారా అని మండిపడ్డారు. నిజామాబాద్ లో అభివృద్ధి ఎక్కడ జరిగిందో చూపించాలని అన్నారు. నిజామాబాద్‌లో ఒక్క ఫ్లై ఓవర్ కట్టింద్రా అని ప్రశ్నిం చారు. నిజామాబాద్ డెవలప్మెంట్ అని చంకలు గుద్దుకుంటున్న అర్బన్ ఎమ్మెల్యే పేదలకు డబుల్ బెడ్ రూం ఇల్లు ఎందుకు పంపిణీ చేయడం లేదన్నారు. వారం, పది రోజులు చూసి మార్పు రాకుంటే, ఉద్యమ కారులను పట్టించుకోకుంటే పార్టీకి నమస్తే పెట్టుడేనని అన్నారు. సమావేశంలో ఉద్యమ నాయకులు ఎడ్ల శేఖర్, అదే ప్రవీణ్, ఈర్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుడి కుటుంబానికి
నష్టపరిహారం చెల్లించాలి

- కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలి
- సిఐటియు డిమాండ్
- కమిషనర్‌కు వినతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

మరణించిన మున్సిపల్ కార్మికుడి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించి ఉద్యోగం కల్పించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. జట్టింగ్ మిషన్‌పై పనిచేస్తున్న అంజయ్య అనే కాంట్రాక్ట్ కార్మికుడు గురువారం ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయారన్నారు. దీంతో ఆయన కుటుంబానికి సంపాదించే ఆధారం కోల్పోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడే ప్రమాదం వచ్చిందని అన్నారు. మరణించిన అంజయ్య కుటుంబానికి మున్సిపల్ కార్పొరేషన్ తరపున 10 లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని ఆయన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ప్రమాదం గురై ఆస్పత్రిలో కొట్టుమిట్టాడుతున్న గంగరాజు అనే కార్మికుడికి మెరుగైన వైద్య సదుపాయం కల్పించి రెండు లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఏ రమేష్ బాబు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు అధ్యక్షులు చంద్ర సింహ, కార్యదర్శి భూపతి, సిఐటియు నగర కో కన్వీనర్ డి కృష్ణతో కలిసి శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విధుల్లో ఉండి ప్రాణాలు కోల్పోయిన కుటుంబాన్ని ఆదరించాల్సిన అవసరం మున్సిపల్ కార్పొరేషన్‌పైన ఉన్నదని అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంటనే స్పందించి వారి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు కాంట్రాక్ట్ , ఔట్సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత లేకపోవడం వల్ల కనీస సౌకర్యాలు అందకుండా ప్రాణాల మీదికి తెచ్చుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రమాదకరమైన విధులు నిర్వహించే వారికి తగిన తర్ఫీదునిచ్చి వారికి భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం పైన ఉందని ఆయన అన్నారు. ప్రమాదానికి గురైన కార్మికులను ఆదుకోవటానికి చనిపోయిన అంజయ్య కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పిస్తామని నష్టపరిహారం కొరకు ప్రభుత్వానికి తెలియజేసి తగిన సహాయం చేస్తామని ప్రమాదానికి గురై హాస్పటల్లో చికిత్స పొందుతున్న కార్మికుని ఆదుకోవటానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రైలులో గంజాయి పట్టివేత

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ రైల్వే పోలీసులు రైల్లో తరలిస్తున్న గంజాయిని పట్టుకున్నారు. నిజామాబాద్ రైల్వే ఎస్సై తావు నాయక్ ఆధ్వర్యంలో విశాఖ నుంచి శిరిడి వెళు తున్న రైలులో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. కామారెడ్డి రైల్వే స్టేషన్ వద్ద ఈ తనిఖీలు ప్రారంభించారు. రైల్వే భోగిలలో తనిఖీలు నిర్వహిస్తుండగా జనరల్ విభాగంలో ఎస్‌కోచ్‌లో అనుమానాస్పదం ఉన్న బ్యాగును తనిఖీ చేశారు. అందులో 25 కిలోల ఎండు గంజాయిని గుర్తించారు. సంబంధిత గంజాయి ఎవరిదని ఆరా తీయగా అక్కడున్న ప్రయాణికులు ఎవరు అది తమది కాదని చెప్పడంతో దానిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ రూ . 6లక్షల25వేలు ఉంటుందని రైల్వే ఎస్సై తావు నాయక్ తెలిపారు.

విశాఖ మన్యం నుంచి రైలులో మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్నారని రైల్వే పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ తనిఖీలలో రైల్వే కానిస్టేబుల్ గురుదాస్, తేనా నాయక్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.



గంజాయిని పట్టుకున్న పోలీసులు

భారతి నృత్యానికేతన్ చిన్నారుల ప్రదర్శన



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణానికి చెందిన భారతి నృత్యానికేతన్ చిన్నారులు శుక్రవారం రాత్రి జరిగిన నృత్య ప్రదర్శనలో అద్భుత ప్రతిభ కనపరిచారు. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బాసర జ్ఞాన సరస్వతి దేవస్థానంలో జరిగిన ఈ కార్యక్రమంలో వీరి ప్రదర్శన చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా నాట్య గురువు సరోజ సుధీర్‌ను సైతం అభినందించారు.

సామూహిక కుంకుమార్చన

నవతెలంగాణ-ఆర్మూర్

దేవీ నవరాత్రి ఉత్సవాల భాగంగా పట్టణంలో శ్రీ లక్ష్మినారాయణ మందిరంలో, నరసింహ స్వామి మందిరంలో మహిళ క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక కుంకుమార్చన, గాజుల పూజ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మున్సిపల్ చైర్పర్సన్ పండిత్ వినీత పవన్, మహిళలు పాల్గొన్నారు.